VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

RNI NO : APTEL/2016/69464

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 84


పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

శుక్రవారం 28 ఆగష్టు 2026

## నేపాల్‌లో చిక్కుకున్న ఏపీ యాత్రికులు

**● ఆర్టీజీఎస్ నుంచి ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ ● సీఎం చంద్రబాబు ఆదేశాలతో 24/7 పర్యవేక్షిస్తున్న ఆర్టీజీఎస్ అధికారులు ● ఆర్టీజీ మంత్రి నారా లోకేష్ నిరంతర పర్యవేక్షణ**



**అమరావతి,కలంకౌంటర్ :** నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరద పరిస్థితుల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ నుంచి నేపాల్ వెళ్లి వరదల్లో చిక్కుకున్న తెలుగువారిని సురక్షితంగా తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆఘమేఘాలమీద రంగంలోకి దిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఐటీ, ఆర్టీజీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆర్టీజీఎస్ అధికారులు, సిబ్బందిని రంగంలోకి దించారు. తెలుగు రాష్ట్రాల నుంచి పలవురు కైలాస మానససరోవర్ యాత్రకు వెళ్లారు. ఆకస్మిక వరదల నేపథ్యంలో కొంతమంది అక్కడ చిక్కుకున్నారు. వీరందరి ఆచూకీ తెలుసుకుని వారి యోగక్షేమాలు కనుక్కునేలా మంత్రి లోకేష్ ఆర్టీజీఎస్ యంత్రాంగాన్ని ఆదేశించి ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించారు. తెలుగు ప్రజల భద్రతకు సంబంధించి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, సంబంధిత ఏజెన్సీలతో సమర్థవంతమైన సమన్వయం ఏర్పాటు చేసి, నేపాల్‌లో చిక్కుకున్న తెలుగు ప్రజలకు అన్ని విధాలా సహాయం అందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ఆదేశాలకు అనుగుణంగా ఆర్టీజీఎస్ తన పర్యవేక్షణ, సమాచార సేకరణ వ్యవస్థను మరింత బలోపేతం చేసింది. ఆర్టీజీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, సీఈఓ ప్రఖర్ జైన్‌లు అటు ఏపీ భవన్, ఇటు ఏపీ ఎన్ఆర్టీ లను సమన్వయపరచుకుని పరిస్థితులను పర్యవేక్షించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అటు ఏపీ భవన్ అధికారులకు, ఇటు సీఎంఓ, ఐటీ మంత్రికి అందజేశారు. తిరుపతి నుంచి మానస సరోవర్ యాత్రకు వెళ్లి నేపాల్ లో చిక్కుకున్న యాత్రికు బృందం ఆచూకీ తెలుసుకుని వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. వీరంతా ఖాట్మాండులోని ఒక హోటల్‌లో సురక్షితంగా ఉన్నారు. వీరితో పాటు నేపాల్‌లో ఇలాగే పలు ప్రాంతాల్లో చిక్కుకున్న యాత్రికుల వివరాలన్నీ వివిధ మార్గాల ద్వారా సేకరించారు. ఆర్టీజీఎస్ బృందం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్న సమాచారాన్ని ధృవీకరించుకుంటూ ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని న్యూ ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులకు అందజేస్తోంది. తద్వారా బాధితులకు తక్షణ సహాయం, భద్రత, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలింపు చర్యలు తీసుకోవడానికి మార్గం సుగమమయ్యేలా చేసింది.

**రియల్ టైమ్ ట్రాకింగ్, సమన్వయం..**

నేపాల్‌లో వరద ప్రభావిత ప్రాంతాల గుండా ప్రయాణిస్తున్న తెలుగు యాత్రికులకు సంబంధించిన సమాచారాన్ని ఆర్టీజీఎస్ నిశితంగా పర్యవేక్షిస్తోంది. ముఖ్యంగా కైలాస మానస సరోవర్ యాత్రికులు ఉపయోగించే నేపాల్--టిబెట్ మార్గంపై ప్రత్యేక దృష్టి సారించింది. అందుబాటులో ఉన్న సమాచారాన్ని సేకరించి, క్రాస్ వెరిఫికేషన్ చేస్తూ,ఇరా భవన్‌తో పాటు ఇతర సంబంధిత సంస్థలతో నిరంతర సమన్వయం కొనసాగిస్తోంది. ఆర్టీజీఎస్ అందించిన సమాచారం ఆధారంగా ఏపీ భవన్ అధికారులు విదేశాంగ మంత్రిత్వ శాఖ, భారత రాయబార కార్యాలయం, నేపాల్ అధికారులు, చైనా అధికారులతో సమన్వయం ఏర్పరుచుకుని నేపాల్‌లో చిక్కుకున్న ఏపీ యాత్రికులను సురక్షితంగా తీసుకొచ్చే చర్యలను ప్రారంభించింది. బాధితులకు సంబంధించిన యోగ క్షేమాల గురించి వారి కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో కోసం ఏపీ భవన్లో ఒక ప్రత్యేక కంట్రోల్ రూమును ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

**ఆర్టీజీఎస్ నుంచి నిరంతర పర్యవేక్షణ..** నేపాల్ వరదల్లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ యాత్రికులందరూ క్షేమంగా తిరిగి వారి స్వస్థలాలకు చేరుకునేంత వరకు ఆర్టీజీఎస్ 24 గంటలూ నిరంతరాయంగా పర్యవేక్షించాలని మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. నేపాల్ వరదల్లో చిక్కుకున్న ఏపీ యాత్రీకులందరి సురక్షితంగా తిరిగి వారి స్వస్థలాలకు చేరేంత వం-కు ఆర్టీజీఎస్ అధికారులు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

## మంగళగిరిలో మోడరన్ రైతు బజార్.. శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ

**● రూ.18.55 కోట్ల వ్యయంతో 5.90 ఎకరాల్లో మార్కెట్ నిర్మాణం ● అరబిందో ఫార్మా ట్రస్ట్ సీఎస్ఆర్ నిధులతో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం ● రిటైల్, హోల్ సేల్ స్టాళ్లు, కోల్డ్ స్టోరేజీతో కూడిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ● మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే ప్రణాళికలో భాగంగా ఈ నిర్మాణం**



**మంగళగిరి,కలంకౌంటర్ :** మంగళగిరిని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మరో కీలక ముందడుగు వేశారు. మంగళగిరి పట్టణంలోని నిడమర్రు రైల్వే గేట్ సమీపంలో రూ. 18.55 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అత్యాధునిక 'మోడరన్ రైతు బజార్' నిర్మాణ పనులకు ఆయన గురువారం భూమిపూజ చేసి, శంకుస్థాపన చేశారు. సుమారు 5.90 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను నిర్మించనున్నారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల నుంచి ఈ ప్రాజెక్టుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని అందిస్తోంది. స్థానిక ప్రజలు, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఈ రిటైల్, హోల్ సేల్ కూరగాయల మార్కెట్ నిర్మాణానికి మంత్రి లోకేశ్ శ్రీకారం చుట్టారు. మొత్తం 71,925 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఇందులో రిటైల్ మార్కెట్ విభాగంలో కూరగాయల విక్రయాల కోసం 102 స్టాళ్లు, పండ్లు, పూల కోసం 54 స్టాళ్లను కేటాయించారు. అలాగే, హోల్ సేల్ మార్కెట్ విభాగంలో 23 దుకాణాలు, 18 అన్‌లోడింగ్ ప్లాట్‌ఫామ్‌లను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు కోల్డ్ స్టోరేజీ, కూరగాయలు ప్రక్షాళన కేంద్రాలు, క్యాంటీన్, వాహనాల పార్కింగ్ వంటి అత్యాధునిక సదుపాయాలను ఇక్కడ కల్పించనున్నారు. శంకుస్థాపన కార్యక్రమం నిమిత్తం విచ్చేసిన మంత్రి లోకేశ్‌కు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన శిలాఫలకాన్ని ఆవిష్కరించి, మార్కెట్ నమూనాను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అరబిందో ఫార్మా ట్రస్ట్ ప్రతినిధులు, స్థానిక టీడీపీ ముఖ్య నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## నేపాల్‌లో ఏపీ యాత్రికులు.. రంగంలోకి దిగిన మంత్రి లోకేశ

**● ఏడుగురిలో నలుగురు క్షేమం, ముగ్గురి ఆచూకీ గల్లంతు ● క్షేమ సమాచారంపై అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష ● యాత్రికులను రప్పించేందుకు రంగంలోకి దిగిన ప్రభుత్వం ● ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి నిరంతర పర్యవేక్షణ**



**అమరావతి,కలంకౌంటర్ :** కైలాస మానససరోవర యాత్రకు వెళ్లి నేపాల్‌లో సంభవించిన వరదల్లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ యాత్రికుల పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఏడుగురు యాత్రికులలో నలుగురు సురక్షితంగా ఉండగా, మరో ముగ్గురి ఆచూకీ తెలియరాలేదని అధికారులు తెలిపారు. ఈ విషయంపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులతో మాట్లాడి తాజా వివరాలు తెలుసుకున్నారు. గల్లంతైన వారిలో కుప్పం ప్రాంతానికి చెందిన బాల సుబ్రహ్మణ్యం, ఈషా ఫౌండేషన్ బృందంలోని శశికుమార్, రాజ్యలక్ష్మి ఉన్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఈషా ఫౌండేషన్ సభ్యుడు శశికుమార్ చివరిసారిగా చైనాలోని గైరోంగ్ ఎంబసీ వద్ద కనిపించినట్లు సమాచారం. గల్లంతైన ముగ్గురి ఆచూకీని త్వరగా కనుగొనేందుకు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని లోకేశ్ అధికారులను ఆదేశించారు. మరోవైపు, కర్నూలు జిల్లాకు చెందిన భాస్కర్ శాస్త్రి సహా మరో ముగ్గురు యాత్రికులు క్షేమంగానే ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. సురక్షితంగా ఉన్నవారిని వీలైనంత త్వరగా రాష్ట్రానికి తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. యాత్రికుల భద్రత, తరలింపు విషయమై భారత రాయబార కార్యాలయం, చైనా, నేపాల్ ఎంబసీలతో పాటు ఈషా ఫౌండేషన్‌తో నిరంతరం సంప్రదింపులు జరపాలని స్పష్టం చేశారు. మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు, ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. యాత్రికుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## రాజధాని గ్రామాల్లో1437 కోట్ల రూ.లతో మౌలిక సదుపాయాల కల్పన

**● లైబ్రరీ,ఆడిటోరియం,హెచ్ఆర్ భవనాల నిర్మాణానికి రూ.596 కోట్లు ● మంగళగిరి పట్టణానికి రోజుకు 30 ఎంఎల్డీ త్రాగునీరు సరఫరా ● రాజధాని గ్రామాలకు సైతం ఇకపై రోజుకు 135 లీటర్లు త్రాగునీరు సరఫరా ● ఇన్నర్ రింగ్ రోడ్,రైల్వే లైన్ల నుండి రాజధాని వరకు గల భూమి ల్యాండ్ పూలింగ్ కు అనుమతి ● రాజధాని ప్రాంతంలోని గ్రామాలన్నిటిలో ఇక అన్నిబీటీ రోడ్లే ● రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖామాత్యులు పొంగూరు నారాయణ**



**అమరావతి,కలంకౌంటర్ :** రాజధాని గ్రామాల్లో రూ. 1437 కోట్లతో వివిధ మౌలిక సదుపాయాల కల్పనకు సిఆర్డీఏ అథారిటీ ఆమోదం తెలిపిందని రాష్ట్ర పురపాలక,పట్టణాభివృద్ధి శాఖామాత్యులు పొంగూరు నారాయణ చెప్పారు.గురువారం ఎపి సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 65వ సీఆర్డీఏ అథారిటీ సమావేశ వివరాలను ఆయన సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలోని శాఖమూరులో రూ. 596 కోట్లతో సెంట్రలైజ్డ్ పబ్లిక్ లైబ్రరీ,ఆడిటోరియం,హ్యూమన్ రిసోర్స్ భవనాలు నిర్మాణానికి సీఆర్డీఏ అథారిటీ అనుమతి ఇచ్చిందని తెలిపారు.మ-ఖ్యంగా రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో క్రిటికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లో భాగంగా రహదారులు,అండర్ గ్రౌండ్ డ్రేనేజీలు,మంచినీటి పైపులు,వీధి దీపాల ఏర్పాటుకు 1437 కోట్ల రూ.లకు అనుమతి ఇచ్చిందని వివరించారు.ఇప్పటి వరకు ఆయా గ్రామాల్లో రోజుకు ఒక్కొక్కరికి 40 లీటర్లు నీరు అందిస్తుండగా లెక్కల ప్రకారం ఒక్కో వ్యక్తికి 135 లీటర్లు అందించాల్సి ఉందన్నారు.కావున ఆయా గ్రామాల్లో తాగునీటి సరఫరా పైపు లైన్లు కూడా పూర్తిగా మార్చే ప్రతిపాధనకు సిఆర్డీఏ అథారిటీ ఆమోదించిందని తెలిపారు.ఆయా గ్రామాల గుండా వెళ్తున్న ట్రంక్ రోడ్లకు ల్యాండ్ టూ ల్యాండ్ ఇవ్వడానికి సైతం ఈ నిధులు వినియోగిస్తామని ఇందుకై మరో రూ. 533 కోట్లు మంజూరు ఆమోదం లభించిందని పేర్కొన్నారు.గతంలో ఈ 29 గ్రామాల్లో మౌలిక సౌకర్యాల నిమిత్తం విడుదల చేసిన రూ. 904 కోట్లుతో కలిపి మొత్తం రూ. 1437 కోట్లతో నూటికి నూరు శాతం మౌలిక సదుపాయాల కల్పన జరుగుతుందని మంత్రి నారాయణ వెల్లడించారు. రాజధాని ప్రాంతంలోని గ్రామాల్లోని లే అవుట్లలో రహదారులను గతంలో సీసీ రోడ్లు నిర్మించాలన్న ప్రతిపాదన ఉంది అయితే సీఆర్ఆర్ఐ న్యూఢిల్లీ,ఐఐటీ ఖరగ్ పూర్ ఆర్గనైజెషన్ లతో పరిశీలన చేయించగా 54 అడుగుల కంటే తక్కువ వెడల్పు ఉన్న రహదారులను సైతం సీసీ కాకుండా బీటీ రోడ్లుగా మర్చాలన్న అభిప్రాయం వ్యక్తం చేయడం జరిగిందని మంత్రి నారాయణ చెప్పారు.నిపుణుల సలహా మేరకు ఆయా రహదారులను సైతం బీటీ రోడ్లుగా నిర్మించడానికి సీఆర్డీఏ అథారిటీ సమ్మతి తెలిపిందన్నారు. మంగళగిరి పట్టణానికి ప్రస్తుతం రోజుకు 30 మిలియన్ లీటర్లు(ఎంఎల్డీ)ప్రతి కిలో లీటర్(కెఎల్డీ) రూ. 10 చొప్పున ఇవ్వడానికి అనుమతి లభించిందని మంత్రి నారాయణ పేర్కొన్నారు.భవిష్యత్తులో 80 ఎంఎల్డి నీరు ఆపట్టణానికి అవసరం ఉంటుందని తెలిపారు.డిస్ట్రిక్ కూలింగ్ సిస్టమ్ కు డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ రూపొందించడానికి నిర్ణయం తీసుకోవడం జరిగిందని అన్నారు.మిక్స్ డ్ యూజ్ క్రింద ప్రైవేట్ వారికి భూమి ఇవ్వడానికి పిచ్చికలపాలెంలో 7.9 ఎకరాలు,తుళ్లూరులో 5ఎకరాలు,మందడంలో 12.38 మరియు 6 ఎకరాలు, కూరగల్లులో 6 ఎకరాలు ఇలా మొత్తం 42 ఎకరాలు సీఆర్డీఏ గుర్తించడం జరిగిందని వాటికి ఆర్ఎఫ్పి పిలవడానికి అనుమతి లభించిందన్నారు. రాజధాని ప్రాంతంలో ఇప్పటికే నిబంధనల మేరకు కేటాయించిన భూమి కంటే ఎక్కువ కావాలని కోరుతున్నస్కూల్స్, హోటల్స్

## చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ జాతీయ సెల్ విభాగాల సహ సమన్వయకర్త విష్ణువర్ధన్ రెడ్డి



**అమరావతి, కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని బీజేపీ జాతీయ సెల్ విభాగాల సహ సమన్వయకర్త ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి గురువారం సాయంత్రం అమరావతిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా జాతీయ స్థాయిలో బాధ్యతలు చేపట్టిన విష్ణువర్ధన్ రెడ్డికి ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టడం అభినందనీయమని పేర్కొంటూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం మరింత సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజా సంక్షేమం కోసం మరింతగా కృషి చేయాలని చంద్రబాబు సూచించినట్లు ఆయన మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో తనకు బాధ్యతలు అప్పగించినందుకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి విష్ణువర్ధన్ రెడ్డి మీడియా ద్వారా ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం మరింతగా పనిచేస్తానని ఆయన తెలిపారు.



# తెలుగుకు వెలుగు గిడుగు

## గిడుగు 163వ జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం



**విశాఖపట్నం,కలంకౌంటర్ :** వ్యవహారిక భాషోద్యమ పితామహుడు, భాషాతపస్వి 'కళాప్రపూర్ణ' గిడుగు వేంకట రామమూర్తి 163వ జయంతి సందర్భంగా ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు శాఖలో గురువారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ గిడుగు రామమూర్తి తన జీవితాన్ని వ్యవహారిక భాషోద్యమానికి అంకితం చేసిన కారణజన్ముడని కొనియాడారు. లోకనాయక్ ఫౌండేషన్ తరఫున తెలుగు శాఖకు రూ.లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ అందజేస్తున్నట్లు ప్రకటించారు. దాని వడ్డీతో ప్రతి ఏటా గిడుగు జయంతి రోజున భాషా ప్రావీణ్యం కనబరిచిన పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులకు అవార్డులు ఇవ్వాలని కోరారు. ఆచార్య జర్రా అప్పారావు మాట్లాడుతూ గిడుగు గ్రాంథిక భాషకు వ్యతిరేకి కాదని, వ్యవహారిక భాషా సాహిత్యానికి పూర్వరంగం వేసిన మహనీయుడని అన్నారు. గిడుగు సేవలను గుర్తించి 1938లో ఆంధ్ర విశ్వకళాపరిషత్ 'కళాప్రపూర్ణ' బిరుదుతో సత్కరించిందని తెలిపారు. ఆచార్య నల్లా సత్యనారాయణ, ఆచార్య గజ్జ యోహాన్ బాబు, డా. మరడాన సుబ్బారావు, ఆచార్య వెలమల సిమ్మన్న, ఆచార్య అద్దాడ నరసింహారావు, డా. చంద్రశేఖరరావు ప్రసంగించారు. గిడుగు వ్యవహారిక, సవర భాషల అభివృద్ధికి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యాపకులు డా. ఎం. కృష్ణవేణి, డా. ఎం. దాసు, డా. బి. సూర్యనారాయణ, డా. ఎం. ప్రతాప్, డా. పి. శ్రీనివాసరావు, డా. ఎల్. గిరీష్‌కుమార్, డా. ఆర్. శివయ్య, ఎం.ఏ. తెలుగు పూర్వవిద్యార్థి, ఏయూ పరిశోధక విద్యార్థి జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు. పితాని ప్రసాద్, సాహితీవేత్తలు, భాషాభిమానులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అంతర్జాతీయ విద్యార్థి వివేక్ కవిత చదవగా, కే. రత్నం ఆహ్వానం పలికారు. ఎస్. డానియల్ వందన సమర్పణ చేశారు.

# హెచ్ఐవి మరియు ఎయిడ్స్ పై కళాజాత




**బంటుమిల్లి,కలంకౌంటర్ :** రాష్ట్రప్రభుత్వము ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ద్వారా కృష్ణ యోజన సంక్షేమ సంఘం పెడన సహకారంతో గురువారం బంటుమిల్లి లో కళాజాత కార్యక్రమం మరియు అవగాహన కార్యక్రమం జరిగింది. బంటుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి కె పవనకుమార్ ఆదేశానుసారం బంటుమిల్లి పట్టణంలోని వాగ్దేవి జూనియర్ కాలేజీ, శ్రీ విజ్ఞాన భారతి డిగ్రీ కాలేజీ క్యాంపస్ లో హెచ్ఐవి అండ్ ఎయిడ్స్ పై ఎల్ ఈ డి వాన్ ద్వారా మరియు క్లాస్ లో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పి. హెచ్.సి డిప్యూటీ హెచ్ ఇ ఓ శ్రీనివాస్ ఎయిడ్స్ ఎలా వస్తుంది, రాకుండా నివారణ తీసుకోవాల్సిన చర్యలను, సమాజంలో మంచి పౌరులుగా ఆరోగ్యవంతులుగా జీవించేందుకు ఎలా ఉండాలి అనే విషయాలపై కూడా కళాశాల విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఓ ఆర్ డబ్ల్యు కల్పన , టీచర్లు,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు

# రిటైర్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



**తిరుపతి,కలంకౌంటర్ :** ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం తిరుపతి డిపో వద్ద రిటైర్ ఉద్యోగులు గేట్ మీటింగ్ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కేఆర్ఎస్ మన్యం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2020 తర్వాత పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలని, ఈపీఎఫ్ కార్యాలయాన్ని బర్కత్‌పురా నుంచి ఆంధ్రప్రదేశ్‌కు తరలించాలని కోరారు. 1996--2014 మధ్య ఈపీఎఫ్‌కు జమ చేసిన మొత్తాలను తిరిగి చెల్లించాలని, ప్రోరేటా పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణానికి అనుమతి కల్పించాలని, 2013--2017 పే స్కేల్స్ ఆధారంగా వాస్తవ వేతనాలపై పెన్షన్‌ను పునర్నిర్ణయించాలని కోరారు. అలాగే 58 ఏళ్లకు బదులుగా 62 ఏళ్ల వరకు ఈపీఎఫ్‌కు చెల్లించిన నాలుగేళ్ల మొత్తాన్ని తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆర్.ఎస్.ఎన్. రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి. సుధాకర్, కోశాధికారి జి.ఎస్. మన్యం, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.ఎస్. ప్రకాష్, నాగేశ్వరరావు, ఏ.వి. రమణ, వి.ఎస్. మన్యం, కె.ఎం.వి. రాయులు, వినయ్ కుమార్, ఎం.కె. రెడ్డి, డి.పి.ఆర్. రెడ్డి, జి.వి.ఎం. కుమార్, ఎన్.ఎస్. మన్యం తదితరులు పాల్గొన్నారు.





సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఏపీసీఆర్డీఏ 65వ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్‌తో పాటు, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, సీఆర్డీఏ కమిషనర్ విజయ్ రామరాజు హాజరయ్యారు. అలాగే, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతోనూ ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాజధాని అమరావతిలో జరుగుతున్న నిర్మాణం పనుల పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

–అమరావతి,కలంకౌంటర్ :

# నేపాల్ వరదల్లో చిక్కుకున్న ఏపీ వాసుల పరిస్థితిపై సీఎం చంద్రబాబు సమీక్ష

- గల్లంతైన వారి ఆచూకీని కనుగొనేలా కేంద్రంతో నిరంతర సంప్రదింపులు జరపాలన్న ముఖ్యమంత్రి
- బాధితులను సురక్షితంగా స్వస్థలాలకు చేర్చేలా చూడాలని అధికారులకు సీఎం ఆదేశం



అమరావతి, **కలంకౌంటర్ :** నేపాల్‌లో సంభవించిన భారీ వరదల్లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ వాసుల పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్షించారు. ఇప్పటివరకు చేపట్టిన సహాయక చర్యలను అధికారులు సీఎంకు వివరించారు. మానస సరోవర్ యాత్ర వెళ్లిన ఏపీకి చెందిన పలువురు యాత్రికులు నేపాల్ వరదల్లో చిక్కుకున్నారని అధికారులు సీఎంకు తెలిపారు. వీరికి సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తున్నామని చెప్పారు. రాష్ట్రానికి చెందిన 41 మంది నేపాల్ వరదల్లో చిక్కుకున్నట్టు ఇప్పటివరకు గుర్తించామని, వీరిలో 34 మంది సురక్షితంగా ఉన్నారని, మరో ఏడుగురి ఆచూకీ తెలియాల్సి ఉందన్నారు. రహదారి, విమాన మార్గాలు పునరుద్ధరించాల్సి ఉండటంతో ప్రస్తుతం కొందరు అక్కడే చిక్కుకుపోయారని అధికారులు తెలిపారు. కర్నూలు–ఆదోని ప్రాంతానికి చెందిన నలుగురు టిబెట్‌లో సురక్షితంగా ఉన్నారని వారితో తాము మాట్లాడమని వివరించారు. అలాగే తిరుపతి ప్రాంతానికి చెందిన 28 మంది యాత్రికులు ఖాట్మండూలో సురక్షితంగా ఉన్నారని వారిని కూడా ఆర్టీజీఎస్ నుంచి సంప్రదించినట్టు అధికారులు చెప్పారు. ఇక చిత్తూరు, విజయవాడ, కాకినాడ, గుంటూరు వంటి ప్రాంతాలకు చెందిన ఏడుగురు గల్లంతు అయ్యారని తెలిపారు. ఆచూకీ లభ్యం కాని ఏడుగురిలో ముగ్గురు ఈషా ఫౌండేషన్ తరఫున మానస సరోవర్ యాత్రకు వెళ్లి చిక్కుకున్నారని తెలిపారు. ప్రస్తుతం వారి ఫోన్లు అందుబాటులో లేవని అధికారులు సీఎంకు వివరించారు. బాధిత కుటుంబాలకు సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేస్తున్నామని చెప్పారు. ఢిల్లీలోని ఏపీ భవన్ లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి నిరంతరం సమాచారాన్ని సేకరిస్తున్నామని కేంద్ర ప్రభుత్వంతో పాటు... ఖాట్మంటూ, చైనాల్లోని ఎంబసీలతో నిత్యం సంప్రదింపులు జరుపుతున్నామని అధికారులు తెలిపారు. నేపాల్‌లో చిక్కుకున్న ప్రతి ఒక్కరి క్షేమం కోసం అన్ని మార్గాల్లో సమన్వయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆచూకీ తెలియని వారి వివరాలను నిరంతరం ట్రాక్ చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వంతో, భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలన్నారు. రహదారి, విమాన మార్గాలు పునరుద్ధరణతో పాటు అవసరమైన ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సురక్షిత తరలింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కష్టాల్లో ఉన్న ఏపీ వాసులను సురక్షితంగా స్వస్థలాలకు తీసుకురావడమే ప్రథమ ప్రాధాన్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ తాజా వివరాలను ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.

# స్వచ్ఛమైన విధులతో దోషరహిత ఓటర్ల జాబితా

- సర్ ప్రక్రియలో ప్రతి దశలోనూ నాణ్యతకే అగ్రస్థానం
- ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్‌లో చొరవ అభినందనీయం
- అక్టోబర్ 3న తుది జాబితా ప్రచురణ వరకు సమష్టి కృషితో ముందుకెళ్లండి
- పైస్థాయి నుంచి బీఎల్‌వో వరకు సరైన సమన్వయం, సహకార స్ఫూర్తి కీలకం
- జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో ఈసీఐ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ





**విజయవాడ,కలంకౌంటర్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో ప్రతి దశలోనూ నాణ్యతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ లోపాలకు తావులేకుండా దోషరహితమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు సమష్టి కృషి అవసరమని.. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు చూపిన చొరవ అభినందనీయమని భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ అన్నారు. గురువారం ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో రాష్ట్రంలో సర్ పురోగతిపై ఈసీఐ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ సమీక్షా, పరస్పర చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీ సీఈవో వివేక్ యాదవ్, అదనపు సీఈవో ఎస్.ఢిల్లీరావుతో పాటు ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, గుంటూరు కలెక్టర్ సి.ఎం.సాయికాంత్ వర్మ, పల్నాడు కలెక్టర్ డా. కృతికా శుక్లా, తూర్పుగోదావరి కలెక్టర్ కీర్తి చేకూరి, పశ్చిమగోదావరి కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఏలూరు కలెక్టర్ కె.వెట్రిసెల్వి, బాపట్ల కలెక్టర్ డా. వి.వినోద్ కుమార్, ఆయా జిల్లాల ఈఆర్‌వోలు ప్రత్యక్షంగా హాజరుకాగా వివిధ జిల్లాల కలెక్టర్లు వర్చువల్‌గా పాల్గొన్నారు. ప్రస్తుతం నోటీసుల జారీ, విచారణ, క్లెయిములు, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్.. జిల్లాల వారీగా పురోగతిని పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 43,71,397 నోటీసుల పంపిణీ కాగా 16,23,774 నోటీసులపై క్షేత్రస్థాయిలో విచారణ పూర్తయింది. ఈ నేపథ్యంలో నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియలో ముందంజలో ఉన్న జిల్లాలను అభినందిస్తూ.. మిగిలిన జిల్లాలోనూ నాణ్యంగా, వేగంగా, పారదర్శకంగా సర్ స్ఫూర్తికి అనుగుణంగా ప్రక్రియను సజావుగా ముందుకు తీసుకెళ్లేందుకు దిశానిర్దేశం చేశారు. నోటీసులపై విచారణకు సంబంధించి ప్రస్తుతానికి అత్యల్పంగా 15.18 శాతం మాత్రమే పెండింగ్ ఉన్న కర్నూలు జిల్లా కలెక్టర్‌ను అభినందించారు. ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు, రాజకీయ పార్టీల మధ్య సమన్వయం, సహకారం అనేవి ప్రక్రియను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు కీలకమని.. ఎవరికి ఏ సందేహమున్నా నివృత్తి చేయడం, సమస్య పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం ముఖ్యమన్నారు. ఓటర్లకు అవసరమైన సహాయసహకారాలు సంతృప్తికరంగా అందించడంలో ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఈ సందర్భంగా పవన్ కుమార్ శర్మ సూచించారు. ప్రస్తుత దశలో జిల్లాల్లో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, నిబంధనల ప్రకారం సరైన కార్యాచరణపైనా సమావేశంలో చర్చించారు. వృద్ధాప్యం, అనారోగ్యం వంటి వివిధ కారణాల వల్ల విచారణకు హాజరుకాలేని పక్షంలో ఈఆర్‌వో/ఏఈఆర్‌వో – బీఎల్‌వోను సమన్వయం చేసుకుంటూ ఇంటి సందర్శన, వివిధ మార్గాల ద్వారా ఓటర్లకు సహాయసహకారాలు అందించాలన్నారు. అదేవిధంగా నోటీసులపై విచారణ అనంతరం క్వాసీ జ్యుడీషియల్ అధికారి అయిన ఏఈఆర్‌వోలు సమస్యను అర్థం చేసుకొని న్యాయమైన తుది నిర్ణయం తీసుకోవాలన్నారు. నోటీసుల విచారణలో వెనుకబడియున్న శ్రీ సత్యసాయి, తిరుపతి, విశాఖపట్నం, బాపట్ల, మార్కాపురం జిల్లాలతో పాటు విశాఖపట్నం వెస్ట్, పెందుర్తి, నెల్లూరు సిటీ, కదిరి, హిందూపూర్, ఉదయగిరి, పెనుకొండ, ఎర్రగొండపాలెం, తిరుపతి, సర్వేపల్లి తదితర నియోజకవర్గాలు సెప్టెంబర్ 5న జరిగే ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష నాటికి సరైన కార్యాచరణతో ప్రగతిపై దృష్టిసారించాలని సూచించారు. సమావేశం సందర్భంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, ఫారం–6, ఫారం–7, ఫారం–8 తదితరాల స్వీకరణ, పరిష్కారం తదితర అంశాలనూ డా. పవన్ కుమార్ శర్మ పరిశీలించారు.

# రాఖీ పౌర్ణమి సందర్భంగా మహిళా లోకానికి మాజీ మంత్రి వెలంపల్లి శుభాకాంక్షలు



**విజయవాడ,కలంకౌంటర్ :** రక్షాబంధన్ పర్వదినం సందర్భంగా రాష్ట్రంలోని మహిళా లోకానికి, ప్రత్యేకించి విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి అక్కకు, ప్రతి చెల్లెమ్మకు మాజీ మంత్రి, వైయస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు హృదయపూర్వక రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అక్కాచెల్లెళ్లపై చూపించే నిస్వార్థమైన ప్రేమ, ఆప్యాయతలకు, అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న పవిత్రమైన అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ అని పేర్కొన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాల్లో స్త్రీలకు ఎల్లప్పుడూ అత్యున్నత స్థానం ఉందని, సమాజంలో మహిళలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి ఆడపడుచుకు, మహిళా మూర్తులకు ఎల్లవేళలా ఆ దేవుడి ఆశీస్సులు, సంపూర్ణ రక్షణ లభించాలని వెలంపల్లి శ్రీనివాసరావు బ్రాహ్మణ వీధిలోని తన కార్యాలయం నుంచి విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ జాతీయ సెల్ విభాగాల సహ సమన్వయకర్త విష్ణువర్ధన్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)


తదితర సంస్థలకు ఎకరా ప్రాథమిక విలువ రూ.4.1 కోట్లు కంటే 250 శాతం ఎక్కువ అంటే సుమారు రూ. 10.25 కోట్లు చెల్లిస్తే వారికి ఆ భూమి అందించడానికి అనుమతి లభించిందన్నారు. రాజధానిలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ ఫర్మేషన్ టెక్నాలజీ డిమ్డ్ యూనిర్సిటీ నిర్మాణానికి 8.5ఎకరాలు కేటాయిం చేందుకు సిఆర్డిఏ అథారిటీ అనుమతిచ్చిందని చెప్పారు.అమరావతి రాజధాని ప్రాంతంలో గ్రీన్ ఎనర్జీ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి ఐఓసీఎల్ తో ఎంవోయూ కుదుర్చుకోవడానికి సీఆర్డీఏకి అనుమతిస్తూ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. రాజధాని ప్రాంతంలో నిర్మించే ఇన్నర్ రింగ్ రోడ్, రైల్వే లైన్లు కంతేరు,తాడికొండ ప్రాంతాల గుండా వెళుతున్నాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు.రాజధాని ప్రాంతం నుండి వాటి వరకు ఉండే భూములను ల్యాండ్ పూలింగ్ క్రింద తీసుకోవడానికి సీఆర్డీఏ అథారిటీ అనుమతి ఇచ్చిందన్నారు.రాజధాని ప్రాంతంలో కొత్తగా ల్యాండ్ పూలింగ్ చేసే భూముల రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తిస్తుందన్నారు.అదీ 2026 జనవరి 6 కంటే ముందు వ్యవసాయ రుణాలు తీసుకున్నవారికి రూ.1లక్ష వరకు రుణమాఫీ అందుతుందని స్పష్టం చేశారు.

# ఏపీ లిక్కర్ స్కామ్.. సిట్, ఈడీ అధికారులతో ఐటీ అధికారుల కీలక సమావేశం!

## ఏపీ లిక్కర్ స్కామ్ లో రంగంలోకి దిగిన ఐటీ శాఖ

**విజయవాడ, కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో ఆదాయపు పన్ను శాఖ రంగంలోకి దిగడంతో దర్యాప్తు కొత్త మలుపు తిరిగింది. ఈ కుంభకోణంలో అక్రమంగా కొల్లగొట్టిన నిధుల మూలాలు, వాటి మళ్లింపుపై ఐటీ అధికారులు ఆరా తీస్తున్నారు. మనీ ట్రయల్‌కు సంబంధించిన కీలక వివరాలను సేకరించేందుకు హైదరాబాద్ వేదికగా సిట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులతో ఐటీ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. షెల్ కంపెనీలను సృష్టించి కోట్లాది రూపాయల నగదును విదేశాలకు మళ్లించినట్లు దర్యాప్తు అధికారులు ఇదివరకే గుర్తించారు. ముఖ్యంగా దుబాయ్ సహా పలు ఇతర దేశాలకు, బినామీ కంపెనీలకు ఈ సొత్తును తరలించినట్లు తేలడంతో... ఆయా కంపెనీల నెట్‌వర్క్, వాటి వెనుక ఉన్న అసలు సూత్రధారులపై ఐటీ దృష్టి సారించింది. అసలు, నిధులు ఏ ఏ ఖాతాల గుండా ఎక్కడికి చేరాయి, విదేశీ ఖాతాలకు, బినామీ సంస్థలకు సొమ్మును ఏ రూపంలో తరలించారనే అంశాలపై ఐటీ అధికారులు దృష్టి సారించారు. ఈ దర్యాప్తు ప్రక్రియలో భాగంగా ప్రధాన నిందితులు, డొల్ల కంపెనీల జాబితా, అనుమానాస్పద బ్యాంకు ఖాతాల వివరాలను ఐటీ అధికారులు తీసుకున్నారు. ఈ కుంభకోణంతో పరోక్షంగా ప్రమేయం ఉన్న ఇతర వ్యక్తులు, ఆర్థిక లావాదేవీలకు సహకరించిన శక్తుల సమాచారాన్ని కూడా సేకరిస్తున్నారు. సిట్, ఈడీ అందించిన ఆధారాలు, నివేదికల ఆధారంగా త్వరలోనే సంబంధిత వ్యక్తులు, సంస్థలపై కఠిన చట్టపరమైన చర్యలు, దాడులకు ఆదాయపు పన్ను శాఖ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

# మహాసభ కార్యాలయం సందర్శన



**హైదరాబాద్,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య గురువారం ఖైరతాబాద్ చింతల్ బస్తీలోని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో మొదటిసారిగా వెళ్లి అక్కడ మహాసభ బిల్డింగ్ పరిశీలించారు.

## డయాగ్నోస్టిక్స్ సెంటర్' ప్రారంభం





**కావలి,కలంకౌంటర్ :** ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు స్థానికంగా అందుబాటులోకి రావడంఅభినందనీయమని స్థానిక శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని క్రిస్టియన్ పేటలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏ వి డయాగ్నోస్టిక్స్ సెంటర్'ను ఆమె ముఖ్య అతిథిగా హాజరై,రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికతతో కూడిన నాణ్యమైన వైద్య పరీక్షలు ప్రజలకు సరసమైన ధరల్లో అందించాలనినిర్వాహకులకు సూచించారు. అనంతరం డయాగ్నోస్టిక్స్ సెంటర్ నిర్వాహకులు శ్రీనివాసులును ప్రత్యేకంగా అభినందించారు.

## భరతనాట్య కళాకారిణి డా. రాజేశ్వరి సాయినాథ్‌కు డిజిపి సి. వి. ఆనంద్ అభినందనలు

– కేంద్ర సంగీత నాటక అకాడమీ ప్రతిష్ఠాత్మక పురస్కారం





**హైదరాబాద్, కలంకౌంటర్ :** ప్రముఖ భరతనాట్య కళాకారిణి డా. రాజేశ్వరి సాయినాథ్‌ను డిజిపి సి.వి. ఆనంద్ అభినందించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని ఆగస్టు 13న అందుకున్న రాజేశ్వరి సాయినాథ్ గురువారం డిజిపి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు సి.వి. ఆనంద్ అభినందనలు తెలిపారు. భరతనాట్యాన్ని దేశ, విదేశాల్లో విస్తృతంగా ప్రదర్శించిన రాజేశ్వరి సాయినాథ్.. అమెరికా, బ్రిటన్ తదితర దేశాల్లోనూ ప్రదర్శనలు ఇచ్చారు. భరతనాట్య అకాడమీని నిర్వహిస్తూ వేలాది మందికి శిక్షణ అందిస్తున్నారు. నృత్యం ద్వారా వైద్యం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక చైతన్యం తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నారు. మ్యాథమెటిక్స్ , డ్యాన్స్ లో పీహెచ్‌డీలు చేసిన ఆమె.. గత 55 సంవత్సరాలుగా భరతనాట్య ప్రదర్శనలు ఇస్తూ కళ పట్ల తన అంకితభావాన్ని చాటుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి రూ.95 లక్షల బీమా పరిహారం



**హైదరాబాద్,కలంకౌంటర్ :** విధి నిర్వహణ అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మల్కాజిగిరి కమిషనరేట్‌కు చెందిన కానిస్టేబుల్ కంబాల శంకర్ కుటుంబానికి రూ.95 లక్షల బీమా పరిహారంను గురు వారం డిజిపి సి.వి.ఆనంద్ చేతుల మీదుగా కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు అందించారు. మల్కాజిగిరి కమిషనరేట్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కంబాల శంకర్ (31) మార్చి 28న విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా వాడపర్తి గ్రామం వద్ద అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యారు. తీవ్ర గాయాలతో తొలుత ఎయిమ్స్‌కు, అనంతరం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించగా.. మార్చి 31న మృతి చెందారు. శంకర్ జీతం బ్యాంక్ ఆఫ్ బరోడా పోలీస్ శాలరీ ప్యాకేజీ ఖాతాలో జమయ్యేది. ప్రమాదంపై బ్యాంకుకు సమాచారం అందడంతో బీమా క్లెయిమ్ ప్రక్రియ చేపట్టారు. జీటీఎల్ కింద రూ.15 లక్షలు, గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ (జీపీఏ) కింద రూ.80 లక్షలు కలిపి మెంత్తం రూ.95 లక్షల పరిహారం మంజూరైంది. ఈ కార్యక్రమంలో ఐజి వెల్ఫేర్ గజరావు భూపాల్, బ్యాంక్ ఆఫ్ బరోడా జనరల్ మేనేజర్, జోనల్ హెడ్ ఎం.వి.ఎస్. సుధాకర్, ఎస్ కె ప్రసాద్, రవి పాల్గొనగా, రూ.95 లక్షల చెక్కును డీజీపీ సి.వి. ఆనంద్ చేతుల మీదుగా మృతుడి తల్లిదండ్రులకు అందజేశారు.

## బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించింది టీడీపీనే - గురుమూర్తి







**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏపీ రాష్ట్ర గౌడ సంక్షేమ మరియు అభివృద్ధి సంస్థ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి గారి అధ్యక్షతన మచిలీపట్నం పార్లమెంట్ టీడీపీ కార్యాలయంలో కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్, టీడీపీ జాతీయ కోశాధికారి కొనకళ్ల నారాయణరావు గారు, మాజీ ఎమ్మెల్సీ వై.వి.బి. రాజేంద్ర ప్రసాద్ గారు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ గారు తదితరులు హాజరయ్యారు. సమావేశంలో బీసీల సంక్షేమం, బీసీ రిజర్వేషన్లు, రానున్న ఎన్నికలు, వర్షాభావ పరిస్థితులు, పంటల సాగు, నీటి లభ్యత, రైతుల సమస్యలు, ఇంటింటి ప్రచారం, పార్టీ సంస్థాగత బలోపేతం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. వీరంకి వెంకట గురుమూర్తి కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షులు, ఏపీ రాష్ట్ర గౌడ సంక్షేమ మరియు అభివృద్ధి సంస్థ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి గారు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. ఎన్టీఆర్ గారి హయాంలోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించామని, అనంతరం చంద్రబాబు నాయుడు గారి హయాంలో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచి బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం కల్పించామని పేర్కొన్నారు. ఆదరణ పథకం ద్వారా రూ.964 కోట్లతో 341 రకాల పనిముట్లను 90 శాతం సబ్సిడీతో బీసీ చేతివృత్తిదారులకు అందించామని తెలిపారు. బీసీ సంక్షేమానికి ప్రత్యేక సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి భారీగా నిధులు కేటాయించడంతో పాటు, బీసీ కార్పొరేషన్ల ద్వారా లక్షలాది మందికి రుణాలు, ఆర్థిక సహాయం అందించామని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని గురుమూర్తి గారు విమర్శించారు. తోట చంద్రయ్య, అమర్నాథ్ గౌడ్ తదితర బీసీ నాయకులు, కార్యకర్తలపై జరిగిన దాడులు, హత్యల ఘటనలను బీసీ సమాజం మరిచిపోలేదని అన్నారు. బీసీలకు రక్షణ కల్పించడంలో గత ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అలాగే వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల సాగుపై ప్రభావం పడే అవకాశం ఉందని, ముఖ్యంగా వర్షాధార పంటలకు తగినంత నీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని గురుమూర్తి గారు తెలిపారు. సాగునీటి వనరుల్లో నీటి లభ్యతను ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ, రైతులకు అవసరమైన నీటిని అందుబాటులో ఉంచేందుకు తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పంటల పరిస్థితిని క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలిస్తూ రైతులకు అవసరమైన సహాయాన్ని అందిస్తున్నారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికలకు పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని, ప్రతి బూత్‌ను బలోపేతం చేసుకుని ప్రజలతో నిరంతరం మమేకం కావాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు. కొనకళ్ల నారాయణరావు ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్, టీడీపీ జాతీయ కోశాధికారి కొనకళ్ల నారాయణరావు గారు మాట్లాడుతూ తనకు మూడు సార్లు ఎంపీగా పోటీ చేసే అవకాశం కల్పించి, తనపై నమ్మకం ఉంచిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. ఎన్టీఆర్ గారి కాలం నుంచి నేటి వరకు బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ, బీసీ నాయకులకు రాజకీయ అవకాశాలు కల్పించిన ఘనత టీడీపీకే దక్కుతుందని తెలిపారు. తనకు మూడు పర్యాయాలు ఎంపీగా పోటీ చేసే అవకాశం ఇవ్వడం ద్వారా బీసీ నాయకత్వంపై టీడీపీకి ఉన్న నమ్మకాన్ని పార్టీ నిరూపించిందని పేర్కొన్నారు. టీడీపీ ఆవిర్భావంతోనే బీసీలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం దక్కిందని అన్నారు. బీసీల గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదని నారాయణరావు గారు విమర్శించారు. కూటమి పాలనలో బీసీలంతా సంతోషంగా ఉన్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరించామని తెలిపారు. గత ఐదేళ్లలో బీసీలకు తీరని అన్యాయం చేసిన జగన్, నేడు బీసీ రిజర్వేషన్ల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బీసీ రిజర్వేషన్లపై కోర్టుల్లో కేసులు వేయించడం గర్హనీయమని విమర్శించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతుల పంటల సాగు, నీటి లభ్యతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని నారాయణరావు గారు తెలిపారు. సాగునీటి వనరుల్లో నీటి లభ్యతను పర్యవేక్షిస్తూ, రైతులకు అవసరమైన నీటిని అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని అన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితులను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. బీసీలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అండగా నిలిచేది తెలుగుదేశం పార్టీ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు.వై.వి.బి. రాజేంద్ర ప్రసాద్ మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు వై.వి.బి. రాజేంద్ర ప్రసాద్ గారు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఓటర్ల జాబితాలపై తన పార్టీ నేతలతో హైకోర్టులో కేసులు వేయించారని ఆరోపించారు. ఓటమి భయంతోనే జగన్ ఇటువంటి కుట్రలు, కుతంత్రాలకు తెరలేపుతున్నారని అన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలోనూ హైకోర్టులో కేసులు వేశారని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం లేక కుంటిసాకులు చెబుతూ ఎన్నికలను ఆపేందుకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. బూరగడ్డ వేదవ్యాస్ మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు బూరగడ్డ వేదవ్యాస్ గారు మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటి ప్రచారం ద్వారా ప్రజలకు వివరించి, ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణ జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ గారు ,బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి. ఫణికుమార్ గారు, రాష్ట్ర కార్యదర్శి బచ్చుల సుబ్రహ్మణ్యం బోస్ గారు, రాష్ట్ర కార్యదర్శి శయన పుష్పవతి గారు, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి బత్తిన దాస్ గారు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నెరుసు రాజ్యలక్ష్మి గారు, జిల్లా ఉపాధ్యక్షులు వంగవీటి శ్రీనివాస్ ప్రసాద్ గారు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి అ ఖ బేగ్ , జిల్లా అధికార ప్రతినిధి తుమ్మలపల్లి హరికృష్ణ గారు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రిజ్వానా బేగం గారు, జిల్లా కార్యదర్శి వసంతకుమారి గారు, గూడూరు మండల పార్టీ అధ్యక్షులు గోపి నాగబాబు గారు, మచిలీపట్నం మండల పార్టీ అధ్యక్షులు కాగిత వెంకటేశ్వరరావు గారు, గూడూరి మండల ప్రధాన కార్యదర్శి తోట వేణు గారు , పాలపర్తి పద్మజ గారు, వేమూరి శ్రీదేవి గారు, ముక్కు రంగమణి గారు తదితర జిల్లా కమిటీ నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అవకాశాలను అందిపుచ్చుకొని యువత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి-జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్







**విజయనగరం,కలంకౌంటర్ :** యువతలో స్ఫూర్తి నింపడంతో పాటు, వారిని సన్మార్గంలో నడిపించేందుకు, యువతే సారథులుగా క్షేత్ర స్థాయిలో ప్రజల్లో మార్పు తీసుకొని వచ్చేందుకు విజయనగరం జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ డెంకాడ మండల కేంద్రంలో “యువ చైతన్యం” పేరుతో వినూత్న కార్యక్రమం శ్రీకారం చుట్టి, యువతతో మమేకమయ్యారు. యువతే సారథులుగా, ప్రజలు – పోలీసుల మధ్య వారదులుగా ప్రజలను జాగృతం చేసి, గ్రామాల్లోని ప్రజల్లో మార్పు తీసుకొని వచ్చేందుకు, చైతన్యపర్చేందుకు జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ యువతీ, యువకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ మాట్లాడుతూ – యువత తలచుకొంటే సాధించలేనిది ఏమీ లేదన్నారు. చైతన్యవంతమైన యువతి, యువకులతో ప్రజల్లో మార్పు తీసుకొని రావచ్చునన్నారు. యువతే సారథులుగా గ్రామాల్లో దురలవాట్లు రూపుమాపేందుకు, ప్రజల్లో చైతన్య తీసుకొని వచ్చేందుకు “యువ చైతన్యం” కార్యక్రమానికి జిల్లా పోలీసుశాఖ శ్రీకారం చుట్టిందన్నారు. నేరాల తీరు, మహిళకు రక్షణగా నిలిచే చట్టాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు చైతన్యవంతమైన యువత ముందుకు రావాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం నేరాల స్వరూపం, విధానం మారుతోందని, ముఖ్యంగా యువతను ప్రభావితం చేసే నేరాలు, వ్యసనాలు, సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు అందించాలనే లక్ష్యంతో కష్టపడి ఉన్నత విద్యను అందిస్తున్నారని, అయితే కొంతమంది యువత చెడు సహవాసాలు, స్నేహితుల ఒత్తిడి, దురలవాట్ల కారణంగా తమ భవిష్యత్తును పాడుచేసుకుంటున్నారని అన్నారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, ఒకసారి డ్రగ్స్ కేసులో నిందితులుగా మారితే వారి విద్య, ఉద్యోగ అవకాశాలు, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. మద్యం, గంజాయి తదితర దురలవాట్లకు బానిసలుగా మారకుండా చైతన్యవంతులు కావాలన్నారు. అదేవిధంగా, మహిళలను ప్రేమ పేరుతో వేధించడం, వెంటపడటం, అసభ్యంగా ప్రవర్తించడం, మైనర్ బాలికల పట్ల అనుచితంగా వ్యవహరించడం వంటి చర్యలకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇటువంటి చర్యలకు పాల్పడి యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. జూదం, క్రికెట్ బెట్టింగ్‌లకు యువత దూరంగా ఉండాలని, బెట్టింగ్‌లకు అలవాటుపడి ఆర్థికంగా నష్టపోయి, అప్పులు చేసి, వాటిని తీర్చేందుకు దొంగతనాలు, మోసాలకు పాల్పడి చివరకు పోలీసు కేసుల్లో చిక్కుకుంటున్న ఘటనలు జరుగుతున్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనకు స్వస్తి పలికి, కష్టపడి విద్య, నైపుణ్యాలను పెంపొందించుకుని మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. చదువుతోనే సమాజంలో ఉన్నతమైన గుర్తింపు లభిస్తుందని ఎస్పీ అన్నారు. ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నా, మంచి ఉద్యోగాలు సాధించాలన్నా, సమాజంలో గౌరవప్రదమైన స్థానం పొందాలన్నా విద్య ఎంతో ముఖ్యమన్నారు. పోలీసు కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్తులో అనేక అవకాశాలను కోల్పోయే ప్రమాదం ఉందని యువత గుర్తించాలన్నారు. నేరాలకు పాల్పడే యువతపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైతే రౌడీషీట్లు ప్రారంభించి వారి కదలికలపై నిఘా పెంచుతామని హెచ్చరించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకులు, అనుమానాస్పద యాప్‌లు, ఆన్‌లైన్ పెట్టుబడులు, ఉద్యోగాల పేరుతో వచ్చే ప్రలోభాలకు లొంగవద్దన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేసి, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మహిళల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, మహిళలు తమ మొబైల్ ఫోన్లలో శక్తి యాప్‌ను అందుబాటులో ఉంచుకుని, అత్యవసర పరిస్థితుల్లో దాని సదుపాయాన్ని వినియోగించి పోలీసుల సహాయం పొందాలని సూచించారు. రహదారి భద్రతకు యువత ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ కోరారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా రెండు కుటుంబాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని తెలిపారు. కుటుంబానికి ఆధారమైన వ్యక్తి ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా తీవ్రంగా నష్టపోతుందని, ఈ విషయాన్ని ప్రతి యువకుడు గుర్తుంచుకోవాలని అన్నారు. “యువత దేశానికి పట్టుకొమ్మలు.. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది” అని ఎస్పీ పేర్కొన్నారు. యువత సన్మార్గంలో నడిచి, సమాజాన్ని మంచి మార్గంలో నడిపించే దిక్సూచిగా నిలవాలని పిలుపునిచ్చారు. తాము నేర్చుకున్న మంచి విషయాలను స్నేహితులు, కుటుంబ సభ్యులు, బంధువులకు తెలియజేసి సమాజంలో సానుకూల మార్పుకు కృషి చేయాలని, ప్రజల్లో చైతన్యం నింపాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి తదితర అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గ్రామ స్థాయిలో యువతే సారథులుగా, ప్రజలు – పోలీసుల మధ్య వారదులుగా వ్యవహరించి, మంచి సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యులు కావాలని జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యువతకు మీతో – మీ ఎస్పీ కరపత్రాలను డెంకాడ పోలీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఇన్‌చార్జ్ డీఎస్పీ ఎస్.రాఘవులు, భోగాపురం రూరల్ సీఐ ఎన్.శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఏవీ లీలారావు, డెంకాడ ఎస్సై ఎ.సన్యాసి నాయుడు తదితర పోలీసు అధికారులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

# ప్రపంచంలో సేవకు ప్రతిరూపం మదర్ థెరిసా

## -రిటైర్ ఎడిషనల్ ఎస్పీ సాయన సుశీలరావు





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం నవచైతన్య మదర్ తెరిసా సేవా సమితి 20వ వార్షికోత్సవం మరియు మదర్ తెరిసా పుట్టినరోజు వేడుకలు గురువారం బుట్టయ్యపేటలోని కాశీనాధుని దుర్గంబ బుచ్చయ్య ట్రస్ట్ దివ్యాంగుల హోమ్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత ఎడిషనల్ ఎస్పీ ఎస్.సుశీలరావు మాట్లాడుతూ ప్రపంచంలో సేవకు ప్రతిరూపం మదర్ తెరిసా అని అన్నారు. విదేశంలో పుట్టిన భారతదేశంలో అందరి మనసులలో స్థానం సంపాదించుకున్న మదర్ తెరిసా సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉంటాయని అన్నారు. మచిలీపట్నంలో చిలకలపూడి సెంటర్ లో మదర్ తెరిసా విగ్రహాన్ని ఏర్పాటు చేసే సువర్ణ అవకాశం మదర్ తెరిసా సేవా సమితికి రావడం అదృష్టమని అన్నారు. గత 20 సంవత్సరాలుగా కొన్ని వందల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మదర్ తెరిసా కి ప్రతిరూపంగా కార్యవర్గం పనిచేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సమితి గౌరవ అధ్యక్షులు సీనియర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ తమ సంస్థ 20వ వార్షికోత్సవం దివ్యాంగుల హోమ్ లో నిర్వహించడం ఎంతో సంతృప్తికరంగా ఉందని అన్నారు. కాశీనాధుని దుర్గంబ బుచ్చయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎలకు రులోనూ మచిలీపట్నంలోనూ వందలాదిమంది దివ్యాంగులకు సేవలందిస్తున్న కాశీనాధుని నాగేశ్వరావు గారి వారసుల సేవలు మరువలేని అని అన్నారు. తమ సంస్థ ద్వారా ప్రతి ఏడాది 17వ డివిజన్లో వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం, రక్తదాన శిబిరాలు కుష్టి రోగులకు సేవా కార్యక్రమాలు పేద విద్యార్థులకు పుస్తకాలు అందజేయడం వంటి పలు సేవా కార్యక్రమాలతో సమస్త ముందుకు వెళుతుందని తెలియజేశారు. సమితి అధ్యక్షులు పైడిపాముల గురు ప్రసాద్ మాట్లాడుతూ భారత రాష్ట్రపతి చేత జాతీయ విశిష్ట సేవా పథకం పొందిన కాశీనాధుని దుర్గాంబా బుచ్చయ్య ట్రస్ట్ లో జరుగుతున్న మానవ సేవ మాధవ సేవతో సమానమని అన్నారు. జీతం తో సంబంధం లేకుండా మానవతా హృదయంతో పనిచేస్తున్న ప్రధాన అధ్యాపకురాలు సునీత మరో నలుగురిని సమితి తరపున సన్మానించారు. రాబోయే రోజులలో తమ సమితి ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు ట్రస్ట్ లో కొనసాగిస్తామని తెలియజేశారు. సమితి ప్రధాన కార్యదర్శి కుమ్మరి జలాచంద్రుడు మాట్లాడుతూ వార్షికోత్సవం సందర్భంగా దివ్యాంగులకు ఉపయోగపడే పది వేల రూపాయల వివిధ పరికరాలను అందించడం జరిగిందని తెలియజేశారు.

ప్రతి ఒక్కరూ జీవితంలో కొంత సమయాన్ని సంపాదనలో కొంత ధనాన్ని సమాజానికి కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యవర్గ సభ్యులు గుంపెన రమేష్ నాంచారయ్య కాశీనాధుని దుర్గమ్మ బుచ్చయ్య నిర్వాహకులు అధ్యాపకులు , విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సేవలు అందిస్తున్న అధ్యాపకులను మదర్ తెరిసా పేరుతో సన్మానం చేశారు. హోమ్ లోని దివ్యాంగులకు తల్లిదండ్రులకు సమితి తరపున భోజనాలు ఏర్పాటు చేశారు.

# ఘన నివాళి



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** అవోపా మచిలీపట్నం ఆధ్వర్యంలో కృష్ణయ్య శెట్టి వర్ధంతి సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహం దగ్గర ఐదురోడ్ల సెంటర్ నందు ప్రెసిడెంట్ ,ఈసీ మెంబర్స్, సభ్యులు కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.




# పట్టాభి స్మారక భవనాన్ని ఏర్పాటు చేయించి యువతకు ఉపయోగపడేలా చేయాలి

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకులు, స్వర్గీయ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనం నిర్మాణ విషయమై కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ సమావేశంలో గురువారం బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పి. వి. ఫణి కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మచిలీపట్నంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి మచిలీపట్నం వచ్చినప్పుడు తొలిసారిగా మచిలీపట్నంలో స్వాతంత్ర సమరయోధుడు, ఆంధ్ర బ్యాంక్ వ్యవస్థాపకుడు స్వర్గీయ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి వైసీపీ పాలకులు అడ్డుపెడుతున్నారని తెలిపి వినతి పత్రం ఇవ్వగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తొలిసారిగా మచిలీపట్నంలో ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా పట్టాభి స్మారక భవనాన్ని ఏర్పాటు చేసి దాని ద్వారా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుచేసి, జిల్లాలోని యువతకు వివిధ రకాల శిక్షణలు ఇచ్చేలా కృషి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మచిలీపట్నం అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు చెప్పారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున మచిలీపట్నం నగర కార్పొరేషన్ లో జిల్లా కలెక్టర్ ఎన్వోసీ ఇచ్చారని, భవనం ఎప్పుడు నిర్మిస్తారని ప్రజలు అడుగుతున్నారని కనుక జిల్లా సమావేశంలో ఈ అంశాన్ని తీర్మానం చేసి. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి పంపాలని బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పి. వి. ఫణి కుమార్ తెలుగుదేశం పార్టీ జిల్లా సమావేశంలో సభాముఖంగా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరంకి గురుమూర్తిని కోరారు.

## 'భగత్ సింగ్ గణేష్ యూత్' బ్రోచర్ల ఆవిష్కరణ



**కావలి,కలంకౌంటర్ :** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరుపుకోవాలని కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డిపిలుపునిచ్చారు. గురువారం తన నివాసంలో స్థానిక 'భగత్ సింగ్ గణేష్ యూత్' ఆధ్వర్యంలో నిర్వహించనున్న 3వ వార్షికోత్సవ గణేష్ ఉత్సవాల బ్రోచర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యువత ఆధ్యాత్మిక భావనతో పాటు సామాజిక దృక్పథాన్ని అలవర్చుకోవాలని, ఉత్సవాల నిర్వహణకు తన పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. తేదీలు: సెప్టెంబర్ 14 నుండి 20 వరకు (7 రోజుల పాటు) ప్రత్యేక పూజలు, సాంస్కృతిక-వినోద కార్యక్రమాలు, నిత్య అన్నదానం/తీర్థప్రసాద వితరణ. ఈ ఉత్సవాల్లో పట్టణ ప్రజలు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని యూత్ కమిటీ ప్రతినిధులు కోరారు.



**తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ను గురువారం స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస రావు సంధర్శించారు. కళాశాలలో ప్రారంబానికి సిద్ధంగా ఉన్న భవనాలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు, వైస్ ప్రిన్సిపాల్ రంగారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.**

-తిరువూరు,కలంకౌంటర్ :

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com